www.kalamdaily.com

14-02-2026, శనివారం

# కలం
ప్రజల గళం..

Follow on: Kalamtelugu



# హస్తం హవా

మున్సిపోల్స్ లో అధికార పార్టీ హవా నడిచింది. అత్యధిక మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కాంగ్రెస్ సొంతం చేసుకుంది. నల్గొండ, ఖమ్మం, వరంగల్ వంటి ఉమ్మడి జిల్లాల్లో ఏకపక్ష విజయాన్ని నమోదు చేసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌తో పాటు ఆయన సొంత జిల్లా ఉమ్మడి పాలమూరులోనూ మూడు రంగుల జెండా ఎగిరింది. కారు పార్టీ కంచుకోటల్లోనూ కాంగ్రెస్ పొద్దు పొడిచింది. 'స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకే ఎక్కువ స్థానాలు' అనే ఆనవాయితీ ఈసారీ రిపీట్ అయింది.

## పాలమూరు గడ్డ.. రేవంత్ అడ్డా

సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ భారీ విజయం సాధించింది. జిల్లాలో మొత్తం 19 మున్సిపాలిటీలు ఉండగా, 14 సొంతం చేసుకుంది. వీటితో పాటు మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లోనూ జెండా పాతింది.

- సీఎం సొంత నియోజకవర్గమైన కొడంగల్ మున్సిపాలిటీలో 12 వార్డులకు గాను 10 వార్డులను కాంగ్రెస్ గెలిచింది. ఓ చోట బీఆర్ఎస్, మరో చోట ఇండిపెండెంట్ విజయం సాధించారు.
- ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని భూత్పూర్, దేవరకద్ర, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, మక్తల్, కోస్గి, మద్దూరు, వనపర్తి, పెబ్బేరు, ఆత్మకూరు, కొత్తకోట, మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ స్పష్టమైన మెజార్టీ సాధించి చైర్‌పర్సన్ స్థానాలను దక్కించుకుంది. ఇక గద్వాల, అలంపూర్, అమరచింత మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాలేదు.
- మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లో మొత్తం 66 డివిజన్లు ఉండగా, కాంగ్రెస్ 30కి పైగా గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది.



## ముగ్గురు మంత్రులు.. క్లీన్ స్వీప్



ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ చేసింది. ఎన్నికలు జరిగిన 7 మున్సిపాలిటీలను సొంతం చేసుకుంది. జిల్లాలో మరోసారి తన పట్టును నిలుపుకుంది. ఈ జిల్లా నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీళ్లు ముగ్గురూ విస్తృతంగా ప్రచారం నిర్వహించి, అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేశారు. ఫలితంగా జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలను సొంతం చేసుకోగలిగారు. ఒక్క వైరా, కల్లూరు మినహా మిగతా ఏ మున్సిపాలిటీలోనూ ప్రత్యర్థి పార్టీలు కనీసం పోటీ కూడా ఇవ్వలేకపోయాయి. ఏదులాపురం, వైరా, మధిర, కల్లూరు, సత్తుపల్లి, ఇల్లెందు, అశ్వారావుపేట మున్సిపాలిటీలను కాంగ్రెస్ సొంతం చేసుకుంది. ఖమ్మం కార్పొరేషన్ పాలక మండలి గడువు తీరకపోవడంతో ఈ సారి అక్కడ ఎన్నికలు జరగలేదు.



## ఉత్తమ్, వెంకట్‌రెడ్డి.. ధమాకా

కాంగ్రెస్‌కు కంచుకోట అయిన ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఆ పార్టీకి మరోసారి అద్భుతమైన విజయం దక్కింది. నల్గొండ కార్పొరేషన్ ను దక్కించుకోవడమే కాకుండా 17 మున్సిపాలిటీలకు గాను 16 సొంతం చేసుకుంది. ఈ జిల్లా నుంచి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మిర్యాలగూడ, భువనగిరి, కోదాడ, సూర్యాపేట మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ అత్యధిక సీట్లు సాధించింది. కార్పొరేషన్ తో పాటు అత్యధిక మున్సిపాలిటీలను కైవసం చేసుకోవడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబురాల్లో మునిగితేలుతున్నాయి. తిరుమలగిరిని మాత్రం బీఆర్ఎస్ సొంతం చేసుకుంది.

## మంత్రుల ఇలాకాల్లో..

**దామోదర రాజనర్సింహ:** ఈయన నియోజకవర్గంలోని ఆందోల్–జోగిపేట మున్సిపాలిటీకి ఎన్నికలు జరుగగా.. 20 వార్డులకు గాను కాంగ్రెస్ 16 సొంతం చేసుకుంది.

**శ్రీధర్ బాబు:** ఈయన నియోజకవర్గంలోని మంథని మున్సిపాలిటీలో 13 వార్డులకు గాను కాంగ్రెస్ 11 చోట్ల గెలిచి చైర్‌పర్సన్ పీఠం కైవసం చేసుకుంది.

**పొన్నం ప్రభాకర్:** ఈయన నియోజకవర్గంలోని హుస్నాబాద్ మున్సిపాలిటీకి ఎన్నికలు జరుగగా.. 20 వార్డులకు గాను కాంగ్రెస్ 16 సొంతం చేసుకుంది.

**జూపల్లి కృష్ణారావు:** ఈయన నియోజకవర్గంలోని కొల్లాపూర్ మున్సిపాలిటీలో 19 వార్డులకు గాను కాంగ్రెస్ 16 చోట్ల గెలిచింది.

**వివేక్ వెంకటస్వామి:** ఈయన నియోజకవర్గంలోని చెన్నూరు, క్యాతనపల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి. చెన్నూరులో కాంగ్రెస్ గెలవగా, క్యాతనపల్లిలో ఏ పార్టీకీ మెజార్టీ రాలేదు.

**అడ్లూరి లక్ష్మణ్:** ఈయన నియోజకవర్గంలోని ధర్మపురి మున్సిపాలిటీలో కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ చేసింది. మొత్తం 15 వార్డులకు గాను అన్నింటినీ గెలుచుకుంది.

**వాకిటి శ్రీహరి:** ఈయన నియోజకవర్గంలో మక్తల్, ఆత్మకూరు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ రెండు చోట్లా కాంగ్రెస్ విజయం సాధించింది.

**సీతక్క:** నియోజకవర్గంలోని ములుగు మున్సిపాలిటీలో 20 వార్డులకు గాను 12 చోట్ల కాంగ్రెస్ గెలిచింది.

మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ ఎక్కువ స్థానాలు గెల్చుకొని మొదటి స్థానంలో నిలిచింది. సెకండ్ ప్లేస్ కోసం బీఆర్ఎస్, బీజేపీ పోటీ పడ్డాయి. కనీసం 85% స్థానాలు గెలుస్తామని కాంగ్రెస్ భావించినా ఆశాభంగం ఎదురైంది. రెండేండ్ల తర్వాత అధికారం మాదే... అర్బన్‌లో ఢోకా లేదు.. అంటూ బీరాలు పలికిన బీఆర్ఎస్ ఇరవై మున్సిపాలిటీలను కూడా చేజిక్కించుకోలేకపోయింది. కేసీఆర్ గజ్వేల్ కోటలో బొటాబొటిగా మ్యాజిక్ ఫిగర్‌తో గట్టెక్కింది. నెక్స్ట్ టైమ్ తెలంగాణలో పవర్ మాదే అని గొప్పగా ప్రకటించుకున్న బీజేపీ ఫస్ట్ టైమ్ కరీంనగర్ కార్పొరేషన్‌ను కైవసం చేసుకున్నా మున్సిపాలిటీల్లో ఒక్కదానితోనే సరిపెట్టుకున్నది. మున్సిపోల్స్‌ను పార్టీల అగ్ర నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని కేడర్‌ను జోష్‌లో ముంచెత్తారు. ఏ నాయకుడి పలుకుబడి ఎంత పనికొచ్చింది?.. తిరుగే లేదనుకున్నచోట ఎన్ని సీట్లు వచ్చాయి?.. ఎవరి ఇమేజ్ ఎంత పెరిగింది?... ఎవరికెంత డ్యామేజ్ అయింది?.. వీటిపై 'కలం' ప్రత్యేక కథనం.





# హిట్.. ఫట్..

## కాంగ్రెస్ పాస్.. అపోజిషన్ ఫెయిల్

# కారు.. బేజారు

పదేండ్లు రాష్ట్రంలో అధికారాన్ని ఏలిన బీఆర్ఎస్ పార్టీకి వరుసగా ఓటర్లు షాక్ ఇస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోవడం, తర్వాత ఎంపీ ఎన్నికల్లో జీరో స్థానాలకే పరిమితమవడం.. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లోనూ అదే పరిస్థితి! 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగితే ఒక్క కార్పొరేషన్ ను కూడా ఆ పార్టీ సాధించలేకపోయింది. ఏకంగా కేసీఆర్ సొంత నియోజకవర్గంలోని గజ్వేల్ మున్సిపాలిటీలో 7 సీట్లతో కాంగ్రెస్ దూసుకొచ్చింది. మొత్తంగా 12 మున్సిపాలిటీలను కారు పార్టీ సాధించినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా ఫలితాలు చూసి ఆ పార్టీ శ్రేణులు కంగుతిన్నారు.

## కేసీఆర్‌కు ఝలక్.. హరీశ్‌కు ట్రబుల్



బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు సొంత సెగ్మెంట్ గజ్వేల్ మున్సిపాలిటీలో ఓటర్లు ఝలక్ ఇచ్చారు. ఇక్కడ గతంలో ఒక్క సీటు మాత్రమే సాధించిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు ఏడు వార్డుల్లో విజయం సాధించింది. 20 వార్డులున్న గజ్వేల్ మున్సిపాలిటీలో బొటాబొటీగా బీఆర్ఎస్ మేజిక్ ఫిగర్ సాధించింది. గులాబీ కంచుకోటలో ఫస్ట్ టైమ్ బీజేపీ ఒక వార్డును గెలుచుకుంది.

**ట్రబుల్ షూటర్ వెంట ఉన్నా..:** ఉమ్మడి మెదక్ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న కేసీఆర్‌కు ప్రచార సారథిగా అల్లుడు హరీశ్ రావు రంగంలోకి దిగినా వార్ వన్‌సైడ్ కాలేదు. ప్రచారం సమయంలో మల్లన్నసాగర్ నిర్వాసితులు చెప్పులు విసిరి నిరసన తెలిపిన ఆగ్రహాన్ని ఓట్ల రూపంలో ప్రదర్శించి కేసీఆర్‌కు, హరీశ్‌రావుకు షాక్ ఇచ్చారు. హరీశ్ రావు ఎమ్మెల్యేగా ఉన్న సిద్దిపేటకు సమీపంలోని హుస్నాబాద్, రామాయంపేట మున్సిపాలిటీలను కాంగ్రెస్ గెలుచుకుంది. ఇక, ఆందోల్, ఇస్నాపూర్, నారాయణఖేడ్, సదాశివపేట, సంగారెడ్డి మున్సిపాలిటీలు సైతం హస్తం వశమయ్యాయి. పలు మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడింది. ఒకప్పుడు ఉమ్మడి మెదక్ జిల్లానే శాసించిన హరీశ్‌రావు ప్రభావం ఇటీవల కాలంలో సిద్దిపేటకే పరిమితమైందని కేడర్‌లో బలమైన అభిప్రాయం. దీనికి తగినట్లుగానే జిల్లాలోని అనేక మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ సత్తా చాటుకోలేకపోయింది. సిద్దిపేట మున్సిపాలిటీ పాలకవర్గం గడువు తీరకపోవడంతో అక్కడ ఎన్నికలు జరగలేదు. ఉమ్మడి జిల్లాలో కార్పొరేషన్లు లేవు.

## కేటీఆర్ .. సిరిసిల్లకే!



బీఆర్ఎస్‌లో కేసీఆర్ తర్వాత స్థానం కేటీఆర్‌ది! పదేండ్ల పాలనలో మున్సిపల్ శాఖ మంత్రిగా పనిచేసిన ఆయన.. పట్టణాలను ఎంతో అభివృద్ధి చేశామని చెప్పుకున్నారు. పట్టణ ఓటర్లు తప్పకుండా తమను ఆదరిస్తారని ఆశించారు. కానీ.. రాష్ట్రవ్యాప్తంగా ఫలితాలు చూస్తే అడియాశలయ్యాయి. ఆయన ఎమ్మెల్యేగా ఉన్న సిరిసిల్ల మున్సిపాలిటీని బీఆర్ఎస్ దక్కించుకున్నప్పటికీ.. పక్కనే ఉన్న వేములవాడలో మాత్రం కాంగ్రెస్ సత్తా చాటింది. ఇక్కడ 28 వార్డులు ఉండగా.. 13 వార్డులను కాంగ్రెస్ దక్కించుకొని పెద్దపార్టీగా అవతరించింది. మరో ఇద్దరు ఇండిపెండెంట్లు గెలిచారు.

**జగదీశ్‌కు షాక్:** ఉమ్మడి నల్లొండ జిల్లాలో బీఆర్ఎస్ కు ఉన్న ఒకే ఒక్క ఎమ్మెల్యే స్థానం సూర్యాపేట. అక్కడ జగదీశ్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బోల్తా కొట్టింది. 31 వార్డులు గెలుచుకొని పీఠాన్ని కాంగ్రెస్ దక్కించుకుంది. 11 వార్డుల వద్దే కారు ఆగిపోయింది.

**గంగుల ఇలాకాలో థర్డ్ ప్లేస్ :** బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ సొంత సెగ్మెంట్ కరీంనగర్ కార్పొరేషన్ ను బీజేపీ దక్కించుకుంది. అక్కడ 2020 ఎన్నికల్లో 60 డివిజన్లు ఉండగా.. బీఆర్ఎస్ 33 స్థానాల్లో గెలిచి పీఠాన్ని కైవసం చేసుకుంది. ఇప్పుడు 66 డివిజన్లకు ఎన్నికలు జరగ్గా.. కారు బేజారైంది. ఏకంగా థర్డ్ ప్లేస్ కు పడిపోయింది.

**వేముల అడ్డాలో ఔట్:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని మున్సిపల్ ఎన్నికలు దెబ్బతీశాయి. తన సొంత బాల్కొండ సెగ్మెంట్ లోని భీంగల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరవేసింది. 12 వార్డులకు గాను కాంగ్రెస్ 8 స్థానాలు సాధించగా, బీఆర్ఎస్ 4 స్థానాలకే పరిమితమైంది.



## 'సింహం' సంచలనం

మున్సిపల్ ఎన్నికల్లో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరపున సింహం గుర్తుపై తన అభ్యర్థులను నిలిపిన జాగృతి అధ్యక్షురాలు కవిత.. తొలి ప్రయత్నంలో సంచలనం సృష్టించారు. ఏకంగా గద్వాల జిల్లాలోని వడ్డేపల్లి మున్సిపాలిటీని ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) పార్టీ సొంతం చేసుకుంది. మొత్తం 10 స్థానాలు ఉండగా.. 8 చోట్ల ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులు విజయం సాధించారు. కాగా, కరీంనగర్ కార్పొరేషన్, పలు మున్సిపాలిటీల్లో కొందరు ఏఐఎఫ్‌బీ అభ్యర్థులు గెలుపొందారు.

## భైంసాలో మజ్లిస్!



భైంసా మున్సిపాలిటీలో మజ్లిస్ జెండా ఎగరేసింది. ఇక్కడి మొత్తం 26 వార్డుల్లో అత్యధిక స్థానాలను ఆ పార్టీ సాధించింది. నిజామాబాద్ కార్పొరేషన్‌లో 14, కరీంనగర్ కార్పొరేషన్‌లో 3, నల్గొండ కార్పొరేషన్‌లో 2 సీట్ల చొప్పున దక్కించుకుంది.

# మున్సిపాలిటీల్లో కమలం ఫ్లాప్

## కరీంనగర్ కార్పొరేషన్‌లో కాషాయ జెండా

పట్టణ ఓటర్లు తమకు పట్టం కడతారని బలంగా నమ్మిన కమలం పార్టీకి కరీంనగర్ కార్పొరేషన్ దక్కింది. మున్సిపాలిటీల్లో మాత్రం ఆ పార్టీ ఫ్లాప్ షో కనబర్చింది. కేవలం ఒక్క మున్సిపాలిటీని దక్కించుకుంది. చాటా చోట్ల థర్డ్ ప్లేస్ కు వెళ్లింది. ఏకంగా ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న కామారెడ్డి, ఆర్మూర్ మున్సిపాలిటీలు కాంగ్రెస్ ఖాతాలో పడ్డాయి. మున్సిపాలిటీల్లో పెద్దగా ప్రభావం చూపకపోయినప్పటికీ రెండు పెద్ద కార్పొరేషన్లలో కమలం పార్టీ జెండా ఎగరేసింది.

## కరీంనగర్‌లో సంజయ్ సత్తా..



ఒకప్పుడు బీజేపీ స్టేట్ చీఫ్ గా.. ఇప్పుడు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ సొంత నియోజకవర్గం కరీంనగర్ పరిధిలో కార్పొరేషన్ స్థానాన్ని కమలం దక్కించుకుంది. కరీంనగర్ కార్పొరేషన్‌లో అత్యధిక స్థానాలు సాధించి సత్తా చాటింది. మున్సిపాలిటీల్లో మాత్రం అంతగా ప్రభావం చూపలేకపోయింది.

- కరీంనగర్ లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలో సిరిసిల్ల, వేములవాడ, హుజురాబాద్, జమ్మికుంట, హుస్నాబాద్, చొప్పదండి మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగాయి. ఇందులో సిరిసిల్ల బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. వేములవాడ హంగ్ వచ్చింది. ఇక్కడ కాంగ్రెస్ ఫస్ట్ ప్లేస్ లో ఉండగా.. బీజేపీ సెకండ్ ప్లేస్ లో నిలిచింది. హుస్నాబాద్‌లో అసలు ఖాతానే తెరువలేదు. చొప్పదండిలో 3 సీట్లను కమలం పార్టీ గెలుచుకుంది.

### అర్వింద్.. ఇందూరులో జెండా

ధర్మపురి అర్వింద్ ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో నిజామాబాద్ కార్పొరేషన్‌లో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. భీంగల్, ఆర్మూర్ మున్సిపాలిటీలు కాంగ్రెస్ వశమయ్యాయి. ఆర్మూర్‌లో బీజేపీకి ఎమ్మెల్యే ఉన్నా ఫలితం దక్కలేదు. బోధన్, జగిత్యాల, కోరుట్ల మున్సిపాలిటీల్లోనూ కమలం పెద్దగా సత్తా చాటలేకపోయింది.

### కొండా.. గట్టెక్కించలే

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం పరిధిలో 4 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగ్గా, ఒక్కటి కూడా బీజేపీ దక్కించుకోలేకపోయింది. తాండూరు, వికారాబాద్, పరిగి, శంకర్‌పల్లి మున్సిపాలిటీల్లో ఆ పార్టీ తక్కువ సీట్లకే పరిమితమైంది. ఇవన్నీ హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న మున్సిపాలిటీలు కావడంతో మంచి ఫలితాలు వస్తాయని బీజేపీ శ్రేణులు భావించాయి.

### రఘునందన్.. ప్రభావం చూపలే

ఎంపీ రఘునందన్ రావు ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్ నియోజకవర్గం పరిధిలోని మున్సిపాలిటీల్లో ఏ ఒక్క దాన్నీ బీజేపీ గెలుచుకోలేకపోయింది. మెదక్, రామాయంపేట, దుబ్బాక, గజ్వేల్, తూప్రాన్, నర్సాపూర్, సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగ్గా.. పెద్దగా సీట్లను కూడా సాధించలేకపోయింది.

### అరుణమ్మ.. సింగిల్ మున్సిపాలిటీ!

మహబూబ్ నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణను మున్సిపోల్స్ నిరాశకు గురిచేశాయి. ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని మహబూబ్ నగర్ కార్పొరేషన్‌ను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఇక్కడ బీజేపీ నాలుగు సీట్లకు మాత్రమే పరిమితమైంది. మక్తల్, షాద్‌నగర్, భూత్పూర్ మున్సిపాలిటీల్లో బీజేపీ జెండా ఎగరవేయలేకపోయింది. నారాయణపేట మున్సిపాలిటీలో మాత్రం బీజేపీ అత్యధిక సీట్లు సాధించి లార్జెస్ట్ పార్టీగా అవతరించింది.

### నగేశ్.. సో సో

ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేశ్ పరిధిలో కార్పొరేషన్లు లేవు. ఆదిలాబాద్, నిర్మల్, భైంసా, కాగజ్‌నగర్, ఖానాపూర్, ఆసిఫాబాద్ మున్సిపాలిటీలు ఉండగా.. ఇందులో ఆదిలాబాద్ స్థానంలో 20కి పైగా స్థానాలు సాధించి లార్జెస్ట్ పార్టీగా బీజేపీ అవతరించింది. మిగతా చోట్ల టఫ్ ఫైట్ ఇచ్చింది.

### జెయింట్ కిల్లర్ అడ్డాలో కాంగ్రెస్!

2023 అసెంబ్లీ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ గా నిలిచిన నియోజకవర్గం కామారెడ్డి. అక్కడ నాటి సీఎం కేసీఆర్, నాటి పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి ఓడించి జెయింట్ కిల్లర్ గా రికార్డులకెక్కారు. అలాంటి అడ్డాలో ఇప్పుడు బీజేపీ ఫెయిలైంది. కామారెడ్డి మున్సిపాలిటీలో మొత్తం 49 సీట్లు ఉండగా.. 19 సీట్లలో గెలిచి అతిపెద్ద పార్టీగా కాంగ్రెస్ అవతరించింది. బీజేపీ 18 సీట్లకు పరిమితమైంది. బీఆర్ఎస్ 10 స్థానాలను, ఇతరులు 2 సీట్లను గెలుచుకున్నారు. ఇక్కడ ఎవరు చైర్ పర్సన్ స్థానాన్ని కైవసం చేసుకుంటారన్నది ఉత్కంఠంగా మారింది.